క్లుప్తంగా

రంజాన్ కిట్ల పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక గోల్డెన్ బేకరీలో పేద ముస్లింలకు రంజాన్ కిట్లను సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ కరీ ముద్దీన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో పేద ప్రజలను శక్తికొద్ది ఆదుకోవాలని పిలుపునిచ్చారు. పట్టణ అధ్యక్షుడు అబ్దుల్‌సమ్మద్ మాట్లాడుతూ దాదాపుగా 200 మందికి రూ. వెయ్యి విలువ జేసే నిత్యావసర సరుకులు అందజేశామని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు షబ్బీర్‌హుసేన్, సలీం, ఖాదర్‌వలి, మహమ్మద్ ఫయాజ్, మహమ్మద్ యూనిస్ పాల్గొన్నారు.

షిర్డీ సాయికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న మహల్సాపతి మునిమనవడు సందీప్

నంద్యాల(వ్యవసాయం): షిర్డిసాయిబాబా ముఖ్య అనుచర భక్తుల్లో మహల్సాపతి నాల్గవ తరం ముని మనవడు సందీప్ మనోహర్‌నగరి గురువారం పట్టణంలోని బొమ్మలసత్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన షిర్డిసాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం షిర్డిసాయిబాబా మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేసి మహామంగళ హారతులు ఇచ్చారు. షిర్డిసాయినాథుడి లీలలను, సందేశాలను భక్తులకు వివరించారు. అనంతరం బాబా మందిరం నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు.

రేపు మార్కెట్ల వేలం

శిరివెళ్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ మార్కెట్ల బహిరంగ వేలం పాటలు ఈ నెల 25వ తేదీన నిర్వహిస్తామని ఈఓఆర్డీ సాల్మన్‌రాజు గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు జరగనున్న వేలంలో వారసంతకు రూ. 50 వేలు, దినమార్కెట్‌కు రూ.40 వేలు, కబేళాకు రూ.10 వేలు డిపాజిట్‌గా చెల్లించాలని చెప్పారు. పంచాయతీకి బకాయిలున్న వారు పాటకు అనర్హులన్నారు. అలాగే.. 25వ తేదీన మధ్యాహ్నం యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ మార్కెట్ల బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. దినమార్కెట్‌కు రూ.15వేలు, వారసంతకు రూ.25 వేలు, కబేళాకు రూ.5 వేలు డిపాజిట్‌కు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

రైతుల భూములను పరిరక్షించాలి

నంద్యాల(అర్బన్): విద్యుత్ ప్రాజెక్ట్ ఏర్పాటు కోసమంటూ పేద రైతుల భూములను తీసుకోవాలనుకోవడం అన్యాయమని ప్రభుత్వం ఆ భూములను పరిరక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు కోరారు. స్థానిక కార్యాలయంలో గురువారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గడివేముల మండలం కొర్రప్రోలూరు గ్రామంలో గత కొన్ని ఏళ్లుగా పేద రైతులు ప్రభుత్వ భూముల్లో పంటల సాగు చేస్తున్నారన్నారు. ఇటీవల విద్యుత్ ప్రాజెక్ట్ నిర్మాణం అంటూ ఆ భూములను రైతుల అనుమతులు లేకుండా తీసుకునేందుకు కొందరు ప్రయత్నాలు ప్రారంభించారన్నారు. భూములు ఇచ్చేందుకు రైతులు అంగీకరించకపోవడంతో వారిని భయభ్రాంతులకు గురి చేస్తుండడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు బాబా ఫక్రుద్దీన్, ప్రసాద్ పాల్గొన్నారు.

సాధువు మృతదేహానికి అంత్యక్రియలు

శిరివెళ్ల: మహదేవపురంలో గురువారం ఓ గుర్తు తెలియని సాధువు మృతి చెందాడు. సర్పంచు సాధువు అంత్యక్రియలకు ముందుకొచ్చి పంచాయతీ కార్మికులకు ఆర్థిక సాయం అందచేసి అంత్యక్రియలు సంప్రదాయంగా జరిగేలా చూశారు. దీంతో కార్మికులు అంత్యక్రియలు నిర్వహించారు.

ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి



భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నంద్యాల: పట్టణంలో భగత్‌సింగ్ 92వ వర్ధంతిని డీవైఎఫ్ఐ, పీడీఎస్‌యూ నాయకులు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. పట్టణంలోని సాయిబాబానగర్‌లో ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా దోపిడీ, పీడన లేని సమాజం కోసం ఉరికంభం ఎక్కిన మహానాయకుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి శివలు మాట్లాడారు. కార్యక్రమంలో నవీన్, నాని, కల్యాణ్, నరసింహ, హరి, వినీత్, సంజయ్, దివాకర్, రమణ, శ్రీరాములు, రాజశేఖర్, గోపాల్, ప్రసాద్ పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న గ్రామ సింహాలు

- నంద్యాల నియోజకవర్గంలో 14,800 కుక్కలు
- వీధి కుక్కలు 14వేలు, పెంపుడు కుక్కలు 800
- కుక్క కాటు నుంచి తప్పించుకునే మార్గాలపై అవగాహన అవసరం
- కుక్క కాటును నిర్లక్ష్యం చేయకూడదంటున్న వైద్యులు





నంద్యాలలోని ఓ ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు, కుక్కకాటుకు గురై విద్యార్థికి చికిత్స చేస్తున్న వైద్యులు (ఫైల్)

నంద్యాల(అర్బన్): పట్టణంతో పాటు గ్రామాల్లో కుక్కల బెడత తీవ్రమైంది. ముఖ్యంగా రాత్రి పూట ఒంటరిగా వెళ్లే వారిపై, వాహనాల వెంట పడి దాడి చేస్తున్నాయి. ఇక వీధుల్లో మహిళలు, చిన్నారులు, వృద్ధులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. దీంతో పట్టణ పరిధిలో ఏదో ఒక రోజుకొకరు కుక్కలబారిన పడుతున్నారు. అయితే కుక్క కాటుకు గురైన వారు నిర్లక్ష్యం చేయకుడా వెంటనే చికిత్స పొందాలని వైద్యులు సూచిస్తున్నారు. బొడ్డు చుట్టూ ఇంజక్షన్లు వేయించుకోవాలని, రేబిస్ వ్యాధి సోకుతుందనే అపోహలను విడనాడాలని చెబుతున్నారు. ముందు చికిత్స పొందితే ఏమీ కాదని పేర్కొంటున్నారు. అవగాహన రాహిత్యంతో కొందరు కుక్క కాటుతో ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు.

నియంత్రణ కాగితాల్లోనే..

వీధి కుక్కల జననాల నియంత్రణ కార్యక్రమాలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. వాటి జనన నియంత్రణ పద్ధతులు పాటించడంతో పాటు రేబిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించాలని గతంలో నిర్ణయించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. నియోజకవర్గంలో ఐదేళ్ల క్రితం దాదాపు 9వేలు కుక్కలు ఉండగా అందులో వీధి కుక్కలు 8,500 ఉండగా పెంపుడు కుక్కలు 500 వరకు ఉన్నాయి. ప్రస్తుతం వీటి సంఖ్య రెట్టింపు అయ్యింది. వీటికి తప్పని సరిగా మూడు నెలల వయస్సులో టీకాలతో పాటు ఏటా బూస్టర్ డోసు వేయించాలని, పెంపుడు కుక్కలకు కూడా విధిగా జనన నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించాలి. వీధి కుక్కలకు మాత్రం నంద్యాల పట్టణంతో పాటు గ్రామాల్లో జనన నియంత్రణ కార్యక్రమాలు చేపట్టిన దాఖలాలు లేవు. పశువైద్య శాలలో ఉచితంగా జనన నియంత్రణ ఆపరేషన్లు చేస్తుండగా ప్రైవేటుగా అయితే దాదాపు రూ.1300 వరకు ఖర్చు వస్తుంది. వీధి కుక్కలను పట్టడం పెద్ద సమస్యగా మారడం, వాటికి జనన నియంత్రణ కార్యక్రమాలు చేపట్టకపోవడంతో కుక్కల సంఖ్య పెరిగిపోతోంది.

కుక్కలు దరి చేరకుండా...

కుక్కలు తమకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పర్చుకొని ఆ ప్రాంతంలోనే నివసిస్తాయి. మనం ఆ ప్రాంతంలో నుంచి తొలగించినా వేరొక గ్రూపు అక్కడికి వచ్చి చేరుతుంది. జనన నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించి రేబిస్ టీకాలు వేయించడం సురక్షితమైన, శాశ్వత పరిష్కారం. ఇంట్లో మిగిలిపోయిన ఆహారం, మాంసం, ఆరుబయట ఎక్కడ పడితే అక్కడ వేసినంత కాలం వీధి కుక్కలకు తిండి దొరికి సంతాన వృద్ధి చెందుతుంది. పెంపుడు కుక్కలను వీధుల్లో వదలి వేయరాదు. వీధి కుక్కలతో పెంపుడు కుక్కలను కలవనివ్వరాదు.

కుక్క కరిస్తే..

కుక్క కరిచిన భాగాన్ని కుళాయి, చెంబు నీళ్లతో సబ్బు రుద్ది పది నిమిషాల పాటు కడగాలి. డెటాల్, బెటాడిన్, ఆఫ్టర్ సేవల్ లోషన్ పూయాలి. వీలైనంత త్వరగా వైద్యుడిని సంప్రదించాలి. పిచ్చికుక్క అయితే మాత్రం వెంటనే రేబిస్ టీకా వేయించాలి. గాయాన్ని రుద్ది కడగరాదు. టించర్, అయోడిన్ వేయరాదు. గాయానికి కట్లు వేయడం, గట్టిగా నొక్కడం చేయరాదు.

కుక్క కాటు నుంచి తప్పించుకోవడం ఇలా..

- వీధి కుక్కలు వెంబడించినప్పుడు బైక్‌లు, సైకిళ్ల వేగం తగ్గించాలి.
- దగ్గరికి వస్తే ఏ మాత్రం కదలకుండా నిలబడి ఉండాలి.
- ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగెత్తరాదు.
- కుక్కల కళ్లలోకి తదేకంగా చూడరాదు.
- కుక్క పిల్లల దగ్గరికి వెళ్లరాదు. తల్లి కుక్క కరిచే ప్రమాదం ఉంది.
- నిద్రిస్తున్నప్పుడు, తింటునప్పుడు పిల్లలకు పాలు ఇస్తున్నప్పుడు వాటిని కర్రలు, రాళ్లతో అదిలించరాదు.
- కుక్క మీద పడి దాడి చేస్తే భయపడి కదలకుండా ముడుచుకోరాదు.
- ముఖాన్ని పంచ, టువాల్‌తో కప్పుకోవాలి.
- కుక్క కోపంగా సమీపిస్తే నేలవైపు చూస్తూ దూరంగా మెల్లగా నడవాలి.
- జనన నియంత్రణ కుక్కలు కరవడం చాలా తక్కువ. వాటిలో ఆగ్రహం తగ్గిపోయి ఉంటుంది.

వీధి కుక్కలను నియంత్రించాలి



వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. ఇటీవల వాటి సంచారం అధికమైంది. వాటిని చూస్తూ వీధుల్లో తిరగాలంటే భయమేస్తుంది. చిన్నారులను చూస్తూనే మీద పడి దాడి చేస్తున్నాయి. బడులకు ఒక్కరు వెళ్లాలంటే విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో కుక్కల బారిన పడి చిన్నారులు చికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. వీధి కుక్కలను నియంత్రించాలని పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది.

–హుసేన్, నూనెపల్లె, నంద్యాల

కుక్క కాటును నిర్లక్ష్యం చేయరాదు

కొంత మంది కుక్కలను చూసి కరుస్తాయన్న భయంతో పరిగెత్తుతారు. అది పద్ధతి కాదు. అలా చేస్తే కుక్కలు అనుమానించి మీదికి వచ్చే అవకాశం ఉంది. ఎలాంటి భయం లేకుండా తన దారిన తాను పోతే కుక్కలు పట్టించుకోవు. పెంపుడు కుక్కలకు విధిగా టీకాలు వేయించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ కుక్క కాటును నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

– వెంకటసుబ్బారెడ్డి, ఏడీ, నంద్యాల

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



శ్రీరంగాపురంలో బండ లాగుతున్న ఎద్దులు



ఉయ్యాలవాడలో మారెమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

రుద్రవరం: మండలంలోని గ్రామాల్లో ప్రజలు గురువారం గ్రామ దేవతలైన పెద్దమ్మ, సుంకులమ్మ, పోలేరమ్మ, మారెమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది పర్వదినం అయిన మరుసటి రోజున గ్రామ దేవతలకు పూజలు చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగానే మండల కేంద్రం వాసులు గ్రామ శివారులోని పొలాల మధ్యనున్న సుంకులమ్మ అమ్మవారిని దర్శించుకొని, పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే గ్రామంలోనున్న పెద్దమ్మ అమ్మవారికి బోనాలతో వెళ్లి పూజలు చేశారు. శ్రీరంగాపురంలో పోలేరమ్మ తిరునాల ప్రారంభమైంది. మొదటి రోజున గ్రామస్తులు అమ్మవారికి విశేష పూజలు చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆలవస్తువులు,గాజుల అంగళ్లు, తినుబండారాల దుకాణాలు ఏర్పాటు చేయడంతో సందడి నెలకొంది. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మొదటి రోజు ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించగా 13 జతల వృషభాలు పోటీల్లో పాల్గొన్నాయి. అనంతరం చెక్క భజన కార్యక్రమం ఆకట్టుకుంది. శుక్రవారం న్యూ కేటగిరీ ఎద్దుల బండలాగుడు పోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

ఉయ్యాలవాడ : మండలంలోని గ్రామాల్లో వెలిసిన శక్తి దేవతలకు గురువారం భక్తులు పూజలు నిర్వహించారు. ఉగాది పండుగ మరుసటి రోజున శక్తి దేవతలకు పూజలు చేయడం ఆనవాయితీ. ఉయ్యాలవాడలో మారెమ్మ, గంగమ్మ, హరివరం, తుడుమలదిన్నె గ్రామాల్లో సుంకులమ్మ, కాకరవాడలో పెద్దమ్మ, సర్వాయిపల్లెలో వెలిసిన శక్తి దేవతలకు బోనాలు సమర్పించి పూజలు చేశారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించండి

- రక్త హీనత నివారణ చర్యలు ముమ్మరం చేయండి
- తక్కువ బరువు ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి
- వీడియో కాన్ఫరెన్స్‌లో చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ, అధికారులు

నంద్యాల: సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో నిర్దేశించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులకు సూచించారు. గురువారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయం నుంచి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, స్కూల్ ఎడ్యుకేషన్, మహిళా, శిశు సంక్షేమ ప్రభుత్వ పథకాలు, విలేజ్, వార్డు సెక్రటేరియట్, స్పందన గ్రీవెన్స్, గడప గడపకు మన ప్రభుత్వం తదితర అంశాలపై కలెక్టర్లు, జేసీలతో చీఫ్ సెక్రటరీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ముఖ్యమైన 8 అభివృద్ధి సూచికల్లో నిర్దేశించిన లక్ష్యాలు సాధించేందుకు ప్రత్యేక కృషి చేయాలన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా అనీమియా నివారణ చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఇందుకోసం గర్భిణులులు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్తహీనత బాధితులను గుర్తించి వారిలో హిమోగ్లోబిన్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే తక్కువ బరువు ఉన్న పిల్లలపై ఐసీడీఎస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మన బడి నాడు–నేడు కింద చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని, జగనన్న గోరుముద్ద పథకాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని కోరారు. జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి కావాలని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఐదేళ్లలోపు ఉన్న చిన్నారులు, కిశోర బాలికలు, బాలింతలు, గర్భిణుల్లో రక్త హీనత, పోషకాహార లోపం ఉన్న వారిపై ప్రత్యేకంగా దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ నిశాంతి, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ చేరిన పది ప్రశ్నపత్రాలు



పోలీస్ స్టేషన్‌లో ప్రశ్నపత్రాలను భద్రపరుస్తున్న దృశ్యం

రుద్రవరం: ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు సంబంధిచిన సెట్–1 ప్రశ్నపత్రాలు గురువారం మండలానికి చేరాయి. జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో రెండు పరీక్ష కేంద్రాల్లో 400 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. ఇంకా సెట్–2 ప్రశ్నపత్రాలు రావాల్సి ఉందని, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ప్రశ్నపత్రాలను భద్రపరిచినట్లు చెప్పారు.

దొర్నిపాడు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన సెట్–1 ప్రశ్నపత్రాలు గురువారం రాగా వాటిని పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచినట్లు పరీక్షల చీఫ్ రాజు తెలిపారు. మండలంలోని భాగ్యనగరం, దొర్నిపాడు, డబ్ల్యూ కొత్తపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన 130 మంది రెగ్యులర్, 20 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. సెట్–2 ప్రశ్నపత్రాలు శుక్రవారం వస్తాయని చెప్పారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు.

కన్నడిగులతో కిక్కిరిసిన మహానంది

- లక్షలాది సంఖ్యలో తరలివచ్చిన కన్నడిగులు
- రెండురోజుల పాటు నిరంతర దర్శనం
- ఆలయానికి రెండురోజుల్లో రూ. 20 లక్షలకు పైగా ఆదాయం



నంది సర్కిల్ వద్ద కన్నడ భక్తజనసందడి



స్వామివారి గ్రామోత్సవం

మహానంది: లక్షలాది సంఖ్యలో వచ్చిన కన్నడిగులతో మహానంది ఆలయం కిక్కిరిసిపోయింది. వేలాదిగా తరలివచ్చిన వాహనాలతో నంది ఎదురుగా ఉన్న దేవస్థానానికి చెందిన సుమారు పది ఎకరాల స్థలం, పార్వతీపురం వైపు ఉన్న స్థలాల్లో వాహనాలు నిండిపోవడంతో రోడ్డుకిరువైపులా కన్నడిగులు వారి వాహనాలను నిలుపుకోవాల్సి వచ్చింది. వివిధ ఆర్జిత సేవా విభాగాల ద్వారా రెండురోజుల్లో ఆలయానికి రూ.20లక్షలు ఆదాయం సమకూరింది. శ్రీశైలంలో జరిగిన రథోత్సవం అనంతరం కన్నడిగులు అక్కడి నుంచి మహానందికి తరలివచ్చారు. బుధవారం వేకువజామున నుంచి గురువారం రాత్రి వరకు రెండ్రోజుల పాటు మహానందీశ్వరుడి నిరంతర దర్శనం కొనసాగింది. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈఓ ఎర్రమల మధు, ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు హరినాథ్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భారంగా ఆర్జిత సేవా టికెట్లు

ఎంతో భక్తిశ్రద్ధలతో పాదయాత్ర, వాహనాల ద్వారా కర్ణాటక నుంచి తరలివచ్చే భక్తులకు ఆర్జిత సేవా టికెట్లు భారంగా మారాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు కేవలం రూ. 50 ఆర్జిత సేవాటికెట్లు మాత్రమే ఇవ్వడంతో దర్శనం పేద భక్తులకు భారంగా మారింది. 22వ తేదీ 5 వేలకు పైగా రూ.50 ఆర్జిత సేవా టికెట్ల ద్వారా రూ. 2.76లక్షలు, 23వ తేదీ సుమారు 14వేలకు పైగా టికెట్లు విక్రయించడంతో రూ. 7.37లక్షలు కలిపి కేవలం రూ.50 ఆర్జిత సేవాటికెట్ల ద్వారా రూ. 10.13లక్షలు ఆదాయం సమకూరింది. వీటితో పాటు రూ. 30, రూ. 20, రూ.10 టికెట్లు జారీ చేశారు. తాత్కాలిక దుకాణాలు, హుండీ కానుకలు, ప్రసాదాల విక్రయాలు, వసతి విభాగాల ద్వారా కేవలం రెండ్రోజుల్లో రూ. 20లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు ప్రాథమిక సమాచారం.

స్వామివారి గ్రామోత్సవం

కర్ణాటక భక్తుల కోసం శ్రీ గంగా, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్ల గ్రామోత్సవం నిర్వహించారు. వేదపండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో విశేష పూజల అనంతరం ఆలయ ప్రాకారంలో పల్లకీ ఉత్సవం చేపట్టారు. బండిఆత్మకూరు మండల పార్నపల్లెకు చెందిన కళాకారులు కోలాటం నృత్యాలు ప్రదర్శించారు.

పోలీసుల పనితీరుపై విమర్శలు

లక్షలాదిగా తరలివచ్చిన కన్నడిగుల రద్దీతో ఆలయంలోని క్యూలైన్లలో తోపులాటలు చోటు చేసుకున్నాయి. తెలంగాణకు చెందిన భక్తులు ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద ఫోన్‌పే లేదంటూ ఏఈఓ వై.మధుతో గొడవపడ్డారు. రాజగోపురం వద్ద మెయిన్ గేటు తెరవాలంటూ కన్నడిగులు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఇన్ని సంఘటనలు జరిగినా బందోబస్తుకు వచ్చిన పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం విమర్శలకు తావిచ్చింది. ఆలయంలో ఎవరికి వారే యమునాతీరే అన్నట్లు పోలీసులు సెల్ ఫోన్లలో నిమగ్నమయ్యారు.

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

నంద్యాల(వ్యవసాయం): ముస్లింలకు ఎంతో పవిత్రమైన రంజాన్ మాసం గురువారం సాయంత్రం నెలవంక కనపడటంతో ఉపవాస దీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయని జమాతే ఇస్లామి హింద్ అధ్యక్షుడు అబ్దుల్ సయ్యద్ బాషా తెలిపారు. ఆయన మాట్లాడుతూ ముస్లింలకు పవిత్రమైన మాసం రంజాన్ అని, దివ్యఖురాన్ గ్రంథం దివి నుంచి భువికి ఈ మాసంలోనే వచ్చిందని, ఉపవాస దీక్ష ద్వారా శరీరాన్ని శుష్కింపజేయడం ద్వారా ఆత్మప్రక్షాళన అవుతుందన్నారు. దీని ద్వారా కోర్కెలు అదుపులో ఉంటాయన్నారు. ఈ మాసంలో ఇమాన్, నమాజ్, జకాత్, రోజా, హజ్‌లలో రోజా అనే ఐదు నియమాలను త్రికరణ శుద్ధితో ఆచరిస్తారని చెప్పారు.

అక్రమ కేసులు సరికాదు

నంద్యాల(అర్బన్): కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాహుల్ గాంధీపై కేంద్ర ప్రభుత్వం తప్పుడు పరువు నష్టం దావా వేసి జైలు శిక్ష విధించడం దారుణమని, నెహ్రూ కుటుంబం కోసం లక్షలాది మంది పార్టీ కార్యకర్తలు జైళ్లకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారని ఏపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల మోహన్‌రావు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, అధికార ప్రతినిధి ఊకొట్టు వాసు, ట్రెజరర్ ప్రసాద్, ఆనందరావు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఆహారంతో రక్తహీనత నివారణ

రుద్రవరం: చిరుధాన్యాల ఆహారంతో రక్తహీనతను నివారించుకోవచ్చని పేరూరు డాక్టర్ వైఎస్సార్ వీహెచ్‌సీ సీహెచ్ఓ పావని తెలిపారు. మండలంలోని కొండమాయపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో పంచాయతీ పరిధిలోని గర్భిణులు, బాలింతలకు గురువారం పోషణ పక్వాడపై అవగాహన కలించారు. ఇందులో భాగంగానే చిరుధాన్యాల ఎంపిక, వాటితో వంట చేసుకోవడం, ఆ ఆహారంతో కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో కొండమాయపల్లెతో పాటు ఆర్.కొత్తూరు,వెలగలపల్లె అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు ఉన్నారు.

27న అభివృద్ధి పనులు ప్రారంభం

రుద్రవరం: ఈనెల 27వ తేదీన మండలంలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ప్రారంభిస్తారని అధికార వర్గాలు గురువారం తెలిపాయి. నల్లవాగుపల్లె, చిత్రేనిపల్లె, ఆలమూరు, టి.లింగందిన్నె, నక్కలదిన్నె, బి.నాగిరెడ్డిపల్లె, యర్రగుడిదిన్నె, పేరూరు, శ్రీరంగాపురం, కోటకొండ, కె.కొత్తూరు, శిరివెళ్ల మండలంలోని మహదేవపురం, బోయలకుంట్ల గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లు, గ్రామ సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్స్, ఆర్‌బీకేల భవనాలు, బీటీ రోడ్లను ప్రారంభించనున్నారని పేర్కొన్నారు.

వైభవంగా ఊంజల సేవ



సంజీవనగర్ రామాలయంలో ఊంజల్ సేవ నిర్వహిస్తున్న దృశ్యం



ఎస్‌బీఐ రామాలయంలో శ్రీరామ నవమి విశిష్టతను వివరిస్తున్న డాక్టర్ దీవీ హయగ్రీవాచారి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక సంజీవనగర్ రామాలయంలో వసంత నవరాత్రులను పురస్కరించుకొని రెండో రోజు ఊంజల సేవా కార్యక్రమాన్ని వేదపండితుల ఆధ్వర్యంలో గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే తెల్లవారుజామున స్వామి, అమ్మవార్లకు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించి పుష్పార్చన తదితర ప్రత్యేక పూజలు జరిపించారు. సాయంత్రం సీతాసమేత లక్ష్మణ ఆంజనేయస్వామి వారికి ఊంజల్ కార్యక్రమం నిర్వహించి నాదం, వేదం, గానం తదితర క్రతువులు చేపట్టారు. భగవత్ సేవా సమాజ్ సభ్యులు సూరయ్య, దేవరశెట్టి శ్రీనివాస్, మధుసూదన్ పాల్గొన్నారు.

ఎస్‌బీఐ రామాలయంలో..

ఎస్‌బీ కాలనీలోని రామాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా చేపట్టిన ఉత్సవాల్లో గురువారం శ్రీరామాయణ సప్తాహంలో భాగంగా శ్రీరామ నవమి విశిష్టతను డాక్టర్ దీవీ హయగ్రీవాచార్యులు భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సుబ్బన్న, అర్చకులు భార్గవరామశర్మ పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎద్దుల బండలాగుడు పోటీలు



బండలాగుతున్న ఎద్దులు

గోస్పాడు: ఉగాది పండుగను పురస్కరించుకొని అంకాలమ్మ తిరునాల సందర్భంగా మండలంలోని సాంబవరం గ్రామంలో గురువారం నిర్వహించిన ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. మండల ఉపాధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పోటీలను ప్రారంభించారు. నాలుగు పండ్ల సైజు విభాగంలో 17జతల ఎద్దులు పోటీల్లో పాల్గొన్నాయి. డోన్ మండలం మల్యాల గ్రామానికి చెందిన ఎస్ఎస్‌వీ ట్రేడర్స్ షేక్‌మైబున్నా ఎద్దులు మొదటి స్థానంలో నిలిచాయి. కర్నూలు జిల్లా కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన కృష్ణప్రసాద్ ఎద్దులు రెండో స్థానం, నంద్యాల మండలం కొత్తపల్లె గ్రామానికి చెందిన గల్లా సాయికుమార్ ఎద్దులు మూడో స్థానం, నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం ఓబులదేవరపల్లి గ్రామానికి చెందిన ధర్మవరం దాసప్ప నాయుడు ఎద్దులు నాల్గో స్థానంలో నిలిచాయి. వైఎస్సార్ జిల్లా దువ్వూరు మండలం దాసరిపల్లె గ్రామానికి చెందిన సురేష్‌కుమార్ ఎద్దులు ఐదో స్థానంలో నిలవగా.. ఎద్దుల యజమానులకు వరుసగా..రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేల నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు.

ముమ్మరంగా భూసేకరణ పనులు



హద్దుల గుర్తింపు పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్

దొర్నిపాడు: నంద్యాల–జమ్మలమడుగు జాతీయ రహదారి (ఎన్‌హెచ్167–కె) నిర్మాణం కోసం మండలంలోని గుండుపాపల గ్రామంలో భూసేకవరణ పనులను తహసీల్దార్ జయప్రసాద్ ముమ్మరం చేశారు. గురువారం గ్రామంలోని రహదారిని మండల సర్వేయర్ మల్లయ్య ఆధ్వర్యంలో భూ సేకరణ ఎంత వరకు పోతుంది, సబ్‌డివిజన్ వివరాలు వంటివి ఆరా తీశారు. ఎన్ని సర్వేయ నంబర్లు, ఎంత మంది రైతుల నుంచి భూములు అవసరమవుతాయనే అంశాన్ని చర్చించారు. కాగా గ్రామంలోని రైతులకు సంబంధించిన 5.54 ఎకరాలు అవసరమయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. వీఆర్ఓ మురళీ, సర్వేయర్లు నాగర్జునరెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.